క్లుప్తంగా

అనంతమహాలక్ష్మికి పూజలు



దుబ్బాక: పూజలు చేస్తున్న భక్తులు

దుబ్బాక: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మున్సిపాల్టీ పరిధిలోని చేర్వాపూర్ అనంతమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు.

సంతోషిమాత ఆలయంలో..

హుస్నాబాద్: శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా పట్టణంలోని శ్రీసంతోషి మాత దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి జ్యోతి, వెనిశెట్టి రాణి, లత, శ్రీలత, నిర్మల, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, భక్తులు పాల్గొన్నారు.

ఏఓగా శివరామకృష్ణ



కొండపాక(గజ్వేల్): కొండపాక మండల వ్యవసాయాధికారిగా శివరామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు పని చేసిన ప్రియదర్శిని సిద్దిపేట జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి బదిలీ అవ్వగా జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి శివరామకృష్ణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు విషయాల్లో ఏ సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఇసుక డంపు పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఇసుక

ములుగు(గజ్వేల్: ములుగు మండలం వంటిమామిడి రాజీవ్ రహదారి సమీపంలో అక్రమంగా నిల్వవుంచిన రెండు ఇసుక డంపులను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, ములుగు పోలీసులు స్వాధీనం చేసుకుని శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. వంటిమామిడికి చెందిన రాజబోయిన పరశురాములు, లేష్కరి భిక్షపతి రాజీవ్‌రహదారి సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా 250టన్నుల ఇసుకను అక్రమంగా డంప్ చేసి ఉంచారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్, ఆర్ఎస్ఐ సాయిచరణ్, పోలీస్ సిబ్బంది విద్యాసాగర్, సుధాకర్‌రావు కలసి ఇసుకను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక, మొరం, మట్టి అక్రమ రవాణా చేసినా, గంజాయి విక్రయించినా టాస్క్‌ఫోర్స్ అధికారుల నంబర్లను (87126 67447, 87126 67446) సంప్రదించాలని సూచించారు.

పగలే వెలుగులు



వెలుగుతున్న స్ట్రీట్‌లైట్

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుత్ అధికారులు పర్యవేక్షణలోపం కారణంగా వీధి దీపాలు పట్టపగలే వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని గుబ్బడి గ్రామంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. అధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

చెత్తను తడి,పొడి వేరుచేసి అందజేయాలి

– మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



ట్యాంక్ నుంచి నీటిని తొలగిస్తున్న రజిత

హుస్నాబాద్: ఇళ్లలోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. 14వ వార్డులో శుక్రవారం 'డ్రై డే ఫ్రైడే' నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ సరోజన, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం





12వ వార్డులో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు.. అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు నరకయాతన పడుతున్నారు. వార్డులోని పలు కాలనీల్లోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండిపోవడంతో నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్లలో ఉండలేని దుస్థితి నెలకొందని, అలాగే ఈగలు, దోమలు విజృంభించడంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీలు శుభ్రపరిచి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– దుబ్బాక

ఆదమరిస్తే అంతే..



ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు రోడ్డు

ఆదమరిచి అటువైపు వెళ్తే ప్రమాదానికి గురికావాల్సిందే. మండలంలోని అనంతసాగర్ నుంచి చిన్నకిష్టాపూర్ వెళ్లే బీటీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కన మట్టి మొత్తం కొట్టుకుపోయి రోడ్డు కయ్యలు కోస్తోంది. దానికి తోడు రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. దీంతో ఆరోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ఏమాత్రం రోడ్డు అంచుకు వెళ్లినా ప్రమాదాలు బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని విక్టరీ, బస్టాండ్ చౌరస్తాలు, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాతోపాటు పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి నాలుగు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.9,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన విద్యార్థి

హుస్నాబాద్: పట్టణంలోని కేరళ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి.అక్షయ్ శశాంక్ సోలాపూర్‌లోని సైనిక్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి సీటు సాధించాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుర్ర రాజేందర్, కరస్పాండెంట్ శైలేందర్, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

హుస్నాబాద్ అభివృద్ధి సతీశ్ ఘనతే



హుస్నాబాద్: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్: నియోజకవర్గం అభివృద్ధి మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ చొరవ వల్లనే జరిగిందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో సతీశ్‌కుమార్ దాదాపు రూ.10వేల కోట్లు నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారన్నారు. రైతు రుణమాఫీ కాని వారు వ్యవసాయ అధికారులు, బ్యాంక్‌ల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సతీశ్‌కుమార్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తీసుకువచ్చిన అభివృద్ధి పనులు పూర్తి చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో అన్వర్ పాష, చంద్రయ్య, మల్లికార్జున్ రెడ్డి, రాజు, శ్రీనివాస్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

నూరుశాతం రుణమాఫీ అబద్ధం

కోహెడ(హుస్నాబాద్): ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాల ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తోందని ప్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అమలు చేసిన పథకాలు అరకొరగా అమలవుతున్నాయని, రూ.2లక్షలు రుణమాఫీ పథకం వందశాతం అనేమాట అబద్ధం అని ఆరోపించారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీకి దరఖాస్తు చేసుకోండి



దరఖాస్తులు తీసుకుంటున్న అధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): అర్హులై ఉండి సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాని రైతులు సంబంధిత వ్యవసాయ అధికారులకు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులు అందజేయాలని అక్బర్‌పేట–భూంపల్లి మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేశ్ తెలిపారు. భూంపల్లి రైతు వేదికలో శుక్రవారం ఏఈఓలతో కలిసి రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సదర్బంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలలోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. కాగా రూ.2లక్షలకు పైగా ఉన్న పంట రుణాలను అర్హులైన రైతులకు త్వరలోనే మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రైతులు ఆందోళన చెందకుండా రూ.2లక్షల రుణమాఫీ కానివారు ఆయా గ్రామాల్లోని ఏఈఓలకు నేరుగా దరఖాస్తులు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు లోహిత్, సమ్రీన్ బేగం, అనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కను సంరక్షిద్దాం..

● మున్సిపల్ కమిషనర్ ప్రేరణ



మొక్కను సరిచేస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేటజోన్: ప్రతి మొక్కను సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ ప్రేరణ పొండ పిలుపునిచ్చారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా ఆమె పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. అదే విధంగా హరిత శుక్రవారంలో భాగంగా నీరు పట్టారు. సిద్దిపేట పచ్చదనంతో నిండాలని సూచించారు. స్థానిక 9వ వార్డులో డ్రై డే సందర్భంగా ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. మురుగు కాలువల్లో చెత్తాచెదారం తీసివేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగీపై అవగాహన కల్పించారు. సాయంత్రం వేళల్లో వాటర్ ఫౌంటెన్ నడిచేలా చూడాలని సూచించారు. అంతకుముందు ఆదర్శనగర్‌లో పర్యటించారు. ఆమె వెంట అధికారులు అన్వేశ్, యాదగిరి, సతీశ్, మాధవి మెప్మా అధికారి రమ్య తదితరులు పాల్గొన్నారు.

జాతరలో కళాకారుల ప్రతిభ



ఉత్తరాంధ్ర జానపద జాతరలో పాల్గొన్న తెలంగాణ డప్పు కళాకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక మిషన్, తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నంలోని గురజాడ కళాక్షేత్రంలో ఉత్తరాంధ్ర జానపద జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఆ కార్యక్రమంలో తెలంగాణ తరఫున డప్పు కళాకారులు పాల్గొని తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వహించిన పురస్కార ప్రదానోత్సవంలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత, మిరుదొడ్డి మండల పరిధిలోని అందె గ్రామానికి చెందిన అందె భాస్కర్‌కు జానపద సామ్రాట్ గౌరవ పురస్కారాన్ని రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి అందజేశారు.

బాధ్యులపై చర్యలేవి?



నినాదాలు చేస్తున్న విద్యార్థి నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలు, చిన్నారులపై దాడులు జరుగుతూనే ఉన్నా బాధ్యులపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి అభిషేక్ భాను ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ అత్యాచార ఘటన యావత్ దేశాన్ని షాక్‌కి గురిచేసిందన్నారు. మూడు రోజుల క్రితం సిద్దిపేటలో మూడేళ్ల బాలికపైనా అఘాయిత్యానికి పాల్పడ్డారని వాపోయారు. అలాంటి వారికి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దినేశ్, అభిలాష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కోహెడ ఎస్ఐగా అభిలాష్



కోహెడ(హుస్నాబాద్): కోహెడ ఎస్ఐగా అభిలాష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని త్రీటౌన్ నుంచి కోహెడకు బదిలీపై వచ్చారు. ఇక్కడి ఎస్ఐ తిరుపతి కరీంనగర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. ఏ సమస్యలు ఉన్నా బాధితులు నేరుగా స్టేషన్‌కు రావచ్చని అభిలాష్ కోరారు.

చికిత్స పొందుతూ మృతి

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకికి చెందిన మటన్ వ్యాపారి టేకు మీనయ్య(47) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మీనయ్య మటన్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం తన ఇంటి నిర్మాణం కోసం రూ.10లక్షలు అప్పు చేశాడు. ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ కొద్ది రోజులుగా ఆందోళన చెందుతున్నాడు. ఈ క్రమంలో 20న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడి కుమారుడు తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నంగునూరు(సిద్దిపేట): పత్తి పంటకు ఆశించే గులాబీరంగు తెగులు సోకకుండా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడంతోపాటు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని బేయర్ క్రాప్ కంపెనీ మెనేజర్ లక్ష్మీనారాయణ రైతులకు సూచించారు. జాగృతి ప్రాజెక్ట్ పథకం కింద ఎల్‌డీపీ, దేశ్‌పాండే, బేయర్ క్రాప్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం సిద్దన్నపేటలో 130 మంది రైతులకు లింగాకర్షక బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి, సతీశ్, రమేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



వర్గల్(గజ్వేల్): విద్యార్థులతో ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తదితరులు

● గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): విద్యార్థులు సోషల్ మీడియాకు, స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంటేనే భవిష్యత్ బాగుంటుందని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వర్గల్ మండలం నాచారం జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు మహిళల చట్టాలు, షీటీమ్ విధులు, ర్యాగింగ్, సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మొద్దన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మహిళల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమారాణి, షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, పీసీలు శ్యామల, రాంచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): గంజాయి ఇతర పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ విజయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గంజాయి, డ్రగ్స్ ఇతర పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను గమనించాలన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు కొమురయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

● వైద్యాధికారి సయ్యద్ ముదస్సీర్



దుబ్బాకటౌన్: విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

దుబ్బాకటౌన్/జగదేవ్‌పూర్(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్: వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తిమ్మాపూర్ వైద్యాధికారి సయ్యద్ ముదస్సీర్ సూచించారు. దుబ్బాకలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాస్టల్ నిర్వాహకులు ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నీటి సంపులు, టొట్లలో నీరు నిల్వకుండా ఉంచాలని, దోమల మందును పిచికారీ చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వెంటనే డాక్టర్లను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రాజేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ వైద్యాధికారి సత్యప్రకాశ్ శుక్రవారం డ్రై డే సందర్భంగా హాస్పటల్‌లోని సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ మార్పువల్ల వైరల్ జ్వరాలు సోకే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ సబ్ యూనిట్ అధికారి డా.శ్రీనివాస్ డ్రై డే సందర్భంగా సంగాపూర్‌లో ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం దృష్ట్యా ప్రతి ఒకరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సురేందర్, వాసుదేవ్, భాగ్యశ్రీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నేషనల్ స్పేస్ డే



అంతరిక్షంలోకి వెళ్తున్న రాకెట్ చిత్రాన్ని ముగ్గుల రూపంలో వేస్తున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: దుబ్బాకలో నేషనల్ స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్పేస్ డేను పురస్కరించుకుని ట్రస్మా ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు ఇస్రో చేపట్టిన ప్రయోగాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా మండల అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యతోపాటు ప్రయోగాత్మక నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అంతరిక్షంలోకి వెళ్తున్న రాకెట్ చిత్రాన్ని ముగ్గులతో అందంగా వేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..



అవగాహన కల్పిస్తున్న సీఐలు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలోని రాజీవ్ రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద చోటు చేసుకుంటున్న ప్రమాదాలపై ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ గ్రామ రోడ్డు భద్రత కమిటీ సభ్యులు, వాహనదారులకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. సాక్షిలో 21న ప్రచురించిన 'డేంజర్ మలుపులు' అనే కథనానికి పోలీస్ కమిషనర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆ ఇద్దరు సీఐలు దుద్దెడలోని ప్రమాదకర మూలమలుపు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అతివేగం, నిబంధనలు పాటించకపోవడమే ప్రమాదాలకు ముఖ్య కారణాలన్నారు. క్షతగాత్రులను రోడ్డు భద్రత కమిటీలు నేరుగా ఆస్పత్రులకు తరలించాలని సూచించారు. త్వరలోనే రోడ్డు స్టాపర్‌లను ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులు, ట్రాఫిక్, త్రీటౌన్ పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన గుగ్గిల్ల దుర్గయ్య, ర్యాకం లచ్చయ్యల కుటుంబాలను శుక్రవారం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, ముక్కిస రాజిరెడ్డి, నాగభూషణం, నారాయణ, సురేశ్, ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల ప్రగతి

సిద్దిపేటజోన్: బీఆర్ఎస్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం అమలైందని సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లు మోహిజ్, వజీర్ అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన కొందరు కౌన్సిలర్లు బీఆర్ఎస్ పాలనలో మైనార్టీలకు ఏమీ ఒరగలేదని ఆరోపించడం సరికాదన్నారు. కేసీఆర్ మంత్రి వర్గంలో డిప్యూటీ సీఎం పదవి మైనార్టీలకు దక్కిందని, షాదీముబారక్ ద్వారా లక్షలాది మంది పేదలకు ఆర్థిక సాయం దక్కిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే హరీశ్‌రావును విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ షాహిద్, మోహిజ్, బాబా తదితరులు పాల్గొన్నారు.

◆ పరిశోధనలపై ఆసక్తి చూపాలి

హుస్నాబాద్: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అంతరిక్షయానం పరిశోధనలు–ఉపగ్రహాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చంద్రయాన్ –3 ద్వారా ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూశాయన్నారు. అనంతరం ఆన్‌లైన్ క్విజ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం వాసుదేవ రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట రమణారెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

◆ ఈతచెట్ల పెంపకంపై అవగాహన

హుస్నాబాద్‌రూరల్: గీత కార్మికుల కుటుంబాల కోసం ప్రభుత్వం ఈతచెట్ల పెంపకం చేపట్టిందని ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. శుక్రవారం పందిల్ల గ్రామంలో గీత కార్మికులకు ఈతచెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ స్థలాల్లో ఈత వనాలను పెంచుకుంటే భవిష్యత్ తరాలకు ఉపాధిని కల్పిస్తాయని చెప్పారు. కావల్సిన మొక్కలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని కార్మికులు ముందుకు రావాలని సూచించారు. మార్క అనిల్‌కుమార్, శ్రీనివాస్, రవీందర్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

◆ రైతులను నిర్లక్ష్యం చేసినందుకే ఓటమి

బెజ్జంకి(సిద్దిపేట): అధికారంలో ఉన్నపుడు రైతులను నిర్లక్ష్యం చేసినందుకే బీఆర్ఎస్ నాయకులు ఓటమి పాలయ్యారని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణమాఫీ, సంక్షేమ పథకాలతో పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక నిందలు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.